# అందరివాడు.. అంబేడ్కర్

- తమ ఆలోచనలు పంచుకున్న ఏయూ విద్యార్థులు
- రాజ్యాంగ నిర్మాతను విభిన్న కోణాల్లో ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: రాజ్యాంగ నిర్మాత, ఆర్థికవేత్త, న్యాయకోవిదుడు ఇలా విభిన్న రంగాల్లో అంబేడ్కర్‌ది అందేవేసిన చేయి అని ఏయూ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జేమ్స్‌స్టీఫెన్ అన్నారు. అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా గురువారం అమెరికన్ కార్నర్‌లో ఏయూ క్యాంపస్ కళాశాలల విద్యార్థులతో డిబేట్ నిర్వహించారు. 'హూ ఓన్స్ అంబేడ్కర్(అంబేడ్కర్ ఎవరికి చెందుతారు)' అనే అంశంపై విద్యార్థులు తమ భావాలను స్వేచ్ఛగా పంచుకున్నారు. విద్యార్థుల భావాలు, ఆలోచనలు వారి మాటల్లో..


డిబేట్‌లో పాల్గొన్న ఏయూ కళాశాలల విద్యార్థులు

## ప్రాజెక్టుల నిర్మాణంలో విశేష కృషి



దేశాభివృద్ధికి నీటి వనరుల లభ్యత, అవసరాన్ని అంబేడ్కర్ గుర్తించారు. సెంట్రల్ వాటర్ కమిషన్ పాలసీని ఆయన తీసుకువచ్చారు. వ్యవసాయానికి అవసరమైన నీటి విభజన, అనేక ఇరిగేషన్ ప్రాజెక్టుల రూపకల్పన అమలులో అంబేడ్కర్ ఆలోచనలు, కృషి ఉన్నాయి. దేశంలో ప్రముఖ ప్రాజెక్టుల నిర్మాణంలో ఆయన కృషి అపారం.

–కె.యతీంద్ర, జియో ఇంజినీరింగ్ విభాగం

## దేశ అవసరాలు తీర్చే ఆలోచన..



దేశానికి అవసరమైన విద్యుత్ అవసరాలను తీర్చే దిశగా అంబేడ్కర్ పనిచేశారు. సెంట్రల్ టెక్నికల్ పవర్ బోర్డ్‌ను ఆయన ఏర్పాటు చేశారు. దేశ వ్యాప్తంగా విద్యుద్దీకరణకు పాటుపడ్డారు. పవర్ డిస్ట్రిబ్యూషన్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో ఆయన చర్చించారు. హైడ్రో, థర్మల్ పవర్ ఉత్పత్తిని పెంచడానికి అంబేడ్కర్ చేసిన సేవలు అమోఘం.

–టి.అచ్యుత్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం

## సమాజంలో వ్యత్యాసాలు రూపుమాపారు..



అంబేడ్కర్ సమాజంలో వ్యత్యాసాలు, అసమానతలను రూపుమాపడానికి కృషి చేశారు. ఆయన తీసుకువచ్చిన యూనిఫాం సివిల్ కోడ్ ఎంతో ఉదాత్త ఆశయంతో చేపట్టినది. ఇది మన కస్టమ్స్‌ని మార్చేస్తుందని అందరూ భావించారు. ఇది వాస్తవం కాదు.. కేవలం అసమానతలను రూపుమాపడానికి దీనిని తీసుకువచ్చారు. న్యాయ విద్యను బోధించడానికి అంబేడ్కర్ ఇష్టపడేవారు.

– డి.హర్షిత, న్యాయ కళాశాల విద్యార్థిని

## అంబేడ్కర్ ఆలోచనలతో ఆర్‌బీఐ స్థాపన



దేశంలో ఆర్‌బీఐ స్థాపనకు అంబేడ్కర్ ఆలోచనలే కారణం. బ్రిటీష్ కాలంలో పన్ను వసూలు చేసే కోటి వ్యవస్థను రద్దు చేసి రైతులు, చేనేతకారులను రుణ విముక్తులను చేశారు. ఆర్థికంగా చితికిపోతున్న వారికి కోటి వ్యవస్థ రద్దు ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది. కేంద్రం, రాష్ట్రాలకు నిధుల విభజన అంబేడ్కర్ పీహెచ్‌డీ ఆధారంగా జరిగినదే.

– డి.శ్రావ్య, అర్థశాస్త్ర విభాగం విద్యార్థిని

## హక్కులకు పరిరక్షకుడు



హక్కులను కల్పించడం ప్రతీ దేశ రాజ్యాంగం చేస్తుంది. హక్కులను పరిరక్షించడానికి సైతం ఒక హక్కును కల్పించిన దార్శనిక ఆలోచన కలిగిన వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్. తన ఆలోచనలను ప్రతిబింబిస్తూ దేశానికి అవసరమైన బలమైన రాజ్యాంగాన్ని ఆయన అందించారు.

–వి.కల్యాణ రామారావు, న్యాయ కళాశాల విద్యార్థి

## రాజ్యాధికారం సాధనతో సమస్యలకు పరిష్కారం



సమాజంలో అనేక సమస్యలకు రాజ్యాధికారం సాధనతో పరిష్కరించవచ్చునని అంబేడ్కర్ విశ్వసించారు. ఆయన రాజకీయ రంగంలో కూడా ప్రవేశించారు. రాజనీతి శాస్త్రవేత్తగానే కాకుండా నిజమైన రాజకీయ నాయకునిగా ఆయన విశేష సేవలు అందించారు.

–జి.శివకోటి, రాజనీతిశాస్త్ర విభాగం విద్యార్థి

## సైన్స్ అందరికీ చేరువ కావాలి..



సైన్స్ అనేది ఒక బ్రహ్మపదార్థంగా ఉండకూడదని, అందరికీ చేరువ కావాలని అంబేడ్కర్ ఆశించారు. దీనిలో భాగంగా ఆర్టికల్ 51ఏ(హెచ్)ని ఆయన తీసుకువచ్చారు. అందరూ సమానమే, అందరికీ సమాన అవకాశాలు అందడం, శాస్త్రీయ ఫలాలు చేరువ కావడంపై ప్రత్యేక దృష్టిపెట్టి పనిచేశారు. – పి.శ్రావణి, కెమిస్ట్రీ విభాగం

## సాగర తీరంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పి.వి.సునీల్‌కుమార్

బీచ్ రోడ్డు: సాగర తీరంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏపీ అడిషనల్ డీజీపీ(అగ్నిమాపక) పి.వి.సునీల్‌కుమార్ గురువారం ఆవిష్కరించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మామిడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ నేటి తరానికి ఆదర్శమన్నారు. సమాజంలో అసమానతలను తొలగించడంలో అంబేడ్కర్ పాత్ర కీలకమైందన్నారు. అంబేడ్కర్‌ను ఒక్క వర్గానికే పరిమితం చేయడం తగదన్నారు. ఆయన అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, సతీష్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా రాజీవ్ గాంధీ, రొయ్యి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మజ్జిగ పంపిణీ


పిఠాపురం కాలనీలో మజ్జిగ పంపిణీ చేస్తున్న డీవైఎఫ్ఐ ప్రతినిధులు

మద్దిలపాలెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మద్దిలపాలెం సమీప పిఠాపురం కాలనీలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి వి.కృష్ణారావు చేతుల మీదుగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా డీవైఎఫ్ ఐ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, సతీష్, రఘురాజా, తులసీ, లక్ష్మణ్, దివాకర్ పాల్గొన్నారు.

### అనధికార అంతస్తు కూల్చివేత


అనధికారిక అంతస్తును కూల్చివేస్తున్న జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది

మద్దిలపాలెం: జీవీఎంసీ జోన్–3 పరిధిలో 22వ వార్డు పిఠాపురం కాలనీలో ఎటువంటి అనుమతులు లేకుండా అనధికారంగా నిర్మించిన అదనపు అంతస్తును జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం కూల్చివేశారు. అనధికారిక కట్టడాన్ని గుర్తించి ముందస్తుగా నోటీసులు జారీ చేశామని, అనంతరం చర్యలు చేపట్టినట్టు జీవీఎంసీ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అనితా తెలిపారు.

### లలితా పీఠంలో చండీ హోమం


చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: లలితానగర్‌లోని లలితా పీఠంలో చైత్ర మాసం, బహుళ అష్టమి సందర్భంగా గురువారం చండీ హోమం నిర్వహించారు. పండితుల వేదమంత్రాల నడుక శాస్త్రోక్తంగా జరిపించారు. గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్టాపన, గోపూజ, పరివార పూజ, సుహాసిని పూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి జరిపించారు. సాయంత్రం కాలభైరవ హోమం జరిపించారు. లోక కల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

### అప్పన్నను దర్శించుకున్న సినీ నటుడు శ్రీకాంత్


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సినీ నటుడు శ్రీకాంత్

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం సినీ నటుడు శ్రీకాంత్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ అప్పలనాయుడు అందజేశారు.

## పేదలకు మెరుగైన విద్యే అంబేడ్కర్‌కు అసలైన నివాళి


మాట్లాడుతున్న మేయర్ హరి వెంకట కుమారి

బీచ్ రోడ్డు: పేద, బడుగు బలహీన వర్గాల పిల్లలకు మెరుగైన విద్యను అందించడమే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌కు మనమిచ్చే అసలైన నివాళిని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరం, పట్టా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో చినవాల్తేరు జీవీఎంసీ వాల్తేర్–2 ప్రాథమిక పాఠశాలలో గురువారం పిల్లలకు నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తన జీవితాన్ని పేద, బడుగు, బలహీన వర్గాల సేవకు అంకితం చేశారని కొనియాడారు. పాఠశాల విద్యార్థులకు ఆమె నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా దళిత రైట్స్ ఫోరం, పట్టా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టా రమేష్బాబును మేయర్ అభినందించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కలిసి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజుబాబు, జీవీఎంసీ పాఠశాల రైల్వే న్యూ కాలనీ ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## 'అంబేడ్కర్ ఆలోచనలతో యువత అనుసంధానం'


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేమ్స్ స్టీఫెన్, ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం అంబేడ్కర్ చెయిర్ ఆధ్వర్యంలో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ వివిధ పోటీలు, ప్యానల్ డిస్కషన్ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలిపారు. గురువారం ఈ మేరకు పోస్టర్‌ను తన కార్యాలయంలో ఆచార్యులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్ మాట్లాడుతూ యువతను అంబేడ్కర్ ఆలోచనలతో అనుసంధానం చేసేలా వివిధ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. శుక్రవారం ఉదయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్–ది వాయిస్ ఆఫ్ ది వాయిస్‌లెస్ అంశంపై చిత్రలేఖనం, సంక్షిప్త వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల నుంచి 100కుపైగా కళాశాలల నుంచి 1800 మందికిపైగా విద్యార్థులు ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఏయూ అంబేడ్కర్ చైర్ సమావేశ మందిరంలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి ఏయూ ఆర్ట్స్, సైన్స్, న్యాయ, ఫార్మసీ, ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన 25 మంది విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ఈ ఐదు రంగాలలో అంబేడ్కర్ చేసిన కృషిని తెలియజేసేలా ఇంటర్ డిసిప్లీనరీ థాట్స్ అండ్ డాక్టర్ అంబేడ్కర్ అంశంపై ప్యానల్ డిస్కషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య కె.వెంకటరావు, ఆచార్య టి.షారోన్ రాజు, ఆచార్య ఎ.కె.ఎం. పవార్, ఆచార్య టి.వి.కృష్ణ, ఆచార్య కె.సీతామాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆసక్తికరంగా నాటక ప్రదర్శనలు


రెండో రోజు ప్రదర్శనలు ప్రారంభిస్తున్న దాడి వీరభద్రరావు, మిశ్రో, వీఎండీఏ ప్రతినిధులు

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ(వీఎండీఏ) ఆధ్వర్యంలో మద్దిపాలెం కళాభారతిలో జరుగుతున్న పైడా కౌశిక్ రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో భాగంగా రెండో రోజు గురువారం ప్రదర్శించిన రెండు నాటక ప్రదర్శనలు ఆసక్తికరంగా సాగాయి. రెండో రోజు ప్రదర్శనలను వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, సీనియర్ నటుడు, రచయిత మిశ్రో ముఖ్యఅతిథులుగా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో చంద్రమామ రావే.. నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకాన్ని శిష్టా చంద్రశేఖర్ రచించగా, ఎన్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు. బిడ్డకు బువ్వ పెట్టడానికి అమ్మ చందమామను చూపిస్తూ గోరుముద్దలు తినిపించి బిడ్డ బతకు కోరుకుంటుంది. అదే అమ్మ వృద్ధాప్యంలో చిన్న చిన్న అవసరాలకు పడే వెతలను కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించి కళాకారులు అందరి మన్నలు పొందారు.

- అనంతరం మనదేశంలో రోజురోజుకు ఆడబిడ్డలపై జరుగుతున్న అఘాయిత్యాలు ఇతివృత్తంగా కట్రపాడుకు చెందిన ఉషోదయ కళానికేతన్ ఆధ్వర్యంలో ప్రక్షాళన నాటకాన్ని కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. ఆధునికత మాయలో చేతికందిన టెక్నాలజీ యావలో పడి అమ్మాయిలు తమ జీవితాలపైకి తెచ్చుకుంటున్న వైనాన్ని చక్కని సన్నివేశాలతో ప్రదర్శించి ప్రేక్షకుల హృదయాలను కదిలించారు. ఈ నాటకానికి రచన, దర్శకత్వం చెరుకూరి సాంబశివరావు వహించారు. ఈ కార్యక్రమంలో వీఎండీఏ ప్రతనిధులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ రాంబాబు పాల్గొన్నారు.

## ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ సిటీనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ నగిరెడ్ల రమేష్ (40) ఆటో బోల్తా పడిన సంఘటనలో బుధవారం మృతి చెందాడు. దీనిపై మృతుని భార్య రమ ఫిర్యాదు మేరకు భీమిలి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. తల్లికి మందులు తీసుకురావడానికి రమేష్ ఆటోపై ఆశిపాలెం వైపు వెళ్తుండగా కుక్క అడ్డం రావడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో కింద రమేష్ ఇరుక్కుపోవడంతో తల, భుజం, చేతులకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 'గడప గడపకూ సంక్షేమ ఫలాలు'



పథకాల గురించి వివరిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని , అప్పారి శ్రీవిద్య

మద్దిలపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో గడప గడపకు సంక్షేమ పథకాలు అందించి చరిత్ర సృష్టించారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. జీవీఎంసీ 15వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరించారు. వారి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా వలంటీర్లతో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారుల ఇంటికే చేరవేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. దీనిని చూసి తట్టుకోలేని ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జోన్–3 స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు అప్పారి గిరిబాబు, వార్డు అధ్యక్షుడు వెంకట్, మహిళా అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, నరాల సత్తిబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల, కన్వీనర్లు, గృహ సారథులు, ఆర్పీలు పాల్గొన్నారు.

## 1600 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

పద్మనాభం: అక్రమంగా వ్యాన్‌తో తరలిస్తున్న 1600 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేసినట్టు సీఐ ఎస్.సన్యాసినాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం పూర్ణామార్కెట్ నుంచి పద్మనాభం మండలం మద్ది గ్రామంలోని ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కార్మికులకు విక్రయించేందుకు బుధవారం రాత్రి వ్యాన్‌తో బియ్యం తరలిస్తుండగా క్రైమ్ ఎస్ఐ ఆర్.మల్లేశ్వరరావు మద్ది జంక్షన్‌లో పట్టుకున్నారని తెలిపారు. బియ్యంతోపాటు వ్యాన్‌ను సీజ్ చేశామన్నారు. క్రైమ్ ఎస్ఐ మల్లేశ్వరరావు ఫిర్యాదు మేరకు బియ్యం తరలిస్తున్న పూర్ణామార్కెట్ పెరికి వీధికి చెందిన గొర్లె దేవరాయలు, భీమునిపట్నం మండలం ఆర్.తాళ్లవలసకు చెందిన కిలారి అభిషేక్‌పై కేసు నమోదు చేశామన్నారు.

## రైతుబజార్‌లో పని చేయని సీసీ కెమెరాలు


పనిచేయని సీసీ కెమెరా

ఆరిలోవ: ఎంవీపీ కాలనీ రైతుబజార్‌లో కొద్ది నెలలుగా సీసీ కెమెరాలు పని చేయడంలేదు. దీంతో చిల్లర దొంగలు తరచూ చేతివాటం ప్రదర్శిస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. నెలల తరబడి ఈ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ఇది పెద్ద రైతుబజార్. ఇక్కడ 178 స్టాళ్లు ఉన్నాయి. అన్ని రకాల కూరగాయలతో పాటు గిరిజన ఉత్పత్తులు విక్రయించడానికి ప్రత్యేకంగా జీసీసీ స్టాల్ కూడా అందుబాటులో ఉంది. ఈ రైతుబజార్‌కు ఆరిలోవ, రవీంద్రనగర్, చినగదిలి, పెదగదిలి, విశాలాక్షినగర్, సాగర్‌నగర్, ఎండాడ, రుషికొండతో పాటు ఎంవీపీ కాలనీ, లాసెన్స్‌బే కాలనీ, ఇసుకతోట, వెంకోజీపాలెం వరకు వినియోగదారులు వస్తుంటారు. దీంతో ప్రతి రోజూ ఈ రైతుబజార్ సందడిగా ఉంటుంది. మొదటి నుంచి ఇక్కడ 8 సీసీ కెమెరాలు ఉండేవి. కరోనా సమయంలో రద్దీ తగ్గడం వల్ల ఇక్కడ పాలనా వ్యవహారం అంతంతమాత్రంగా తయారైంది. సీసీ కెమెరాల నిర్వహణను కూడా అధికారులు గాలికి వదిలేశారు. సుమారు రెండేళ్లుగా మూలకు చేరాయి. వీటి స్థానంలో కొత్తవి అమర్చడం గానీ, మరమ్మతులు చేపట్టడం గానీ అధికారులు చేయలేదు. రద్దీగా ఉన్న సమయంలో సెల్‌ఫోన్‌లు, నగదు చోరీలు తరచూ జరుగుతున్నాయి. దీనిపై అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా సీసీ కెమెరాలు పనిచేయక ఫలితం ఉండడం లేదు. గతంలో సీసీ కెమెరాలు పనిచేయడంతో ఇలాంటి దొంగతనాలకు అడ్డుకట్టపడింది. ఇప్పుడు కెమెరాలు పనిచేయకపోవడంతో మళ్లీ ఫోన్ దొంగతనాలు సాధారణమైపోయింది. రెండు నెలల కిందట మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే ఈ రైతుబజార్‌ను సందర్శించి సీసీ కెమెరాలు వెంటనే ఏర్పాటు చేయాలని మార్కెటింగ్ శాఖ ఏడీని ఆదేశించారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ప్రస్తుతం 12 సీసీ కెమెరాలు ఇక్కడ అవసరమని రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ ప్రసాద్ తెలిపారు. దీనిపై ఉన్నధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

## హస్త కళాకారులకు ప్రోత్సాహం



స్టాల్ ప్రారంభిస్తున్న నాబార్డ్ ఏపీ డీజీఎం కేవీఎస్ ప్రసాద్

దాబాగార్డెన్స్: గ్రామీణ హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను పట్టణాల్లో విక్రయించి, వారిని ప్రోత్సహించడమే నాబార్డ్ లక్ష్యంగా పనిచేస్తోందని నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ డీజీఎం కేవీఎస్ ప్రసాద్ తెలిపారు. హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను నాబార్డ్ ఆర్థిక సహకారంతో నేస్తం సంస్థ ఆధ్వర్యంలో స్టాల్ ఇన్ మాల్ పేరిట పట్టణాల్లో స్టాల్స్ ఏర్పాటు చేసి వాటిని అందుబాటు ధరలకే విక్రయిస్తున్నట్టు చెప్పారు. నగరంలోని ఓ ప్రముఖ షాపింగ్ మాల్‌లో పలు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 12 వరకు హస్త కళాకారుల ఉత్పత్తుల విక్రయాలు జరుగుతాయని తెలిపారు. హస్త కళాకారులకు స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు ఉచితంగా వసతి సదుపాయం కూడా కల్పిస్తున్నామన్నారు. మహా విశాఖ ప్రజలు హస్తకళాకారులు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసి ప్రోత్సహించాలని కోరారు. నాబార్డ్ విశాఖ ప్రాంతీయ అధికారి శ్రీనివాసరావు, నేస్తం ఎన్జీవో సంస్థ సురేష్ మాట్లాడుతూ ఈ స్టాల్స్‌లో హస్త కళాకారులు తయారు చేసిన నాణ్యమైన ఉత్పత్తులు ప్రజలకు లభిస్తాయన్నారు.

## జొమాటో డెలివరీ బాయ్‌పై రౌడీషీటర్ దాడి

మల్కాపురం: జొమాటో డెలివరీ బాయ్‌పై ఓ రౌడీషీటర్ దాడి చేసిన ఘటన మల్కాపురంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాకకు చెందిన రామ్‌సతీష్‌కుమార్ జొమాటోలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. తన వృత్తిలో భాగంగా మల్కాపురం కృష్ణ బార్ అండ్ రెస్టారెంట్ సమీప ప్రాంతంలోని ఓ వ్యక్తికి ఫుడ్ డెలివరీ చేసేందుకు ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి వచ్చాడు. ఆ సమయంలో బార్ వెనక మార్గంలో ఉన్న మల్కాపురానికి చెందిన రౌడీషీటర్ ఉదయ్.. రామ్‌సతీష్‌కుమార్ వద్దకు వచ్చి ఆ పార్శిల్ తనదేనని, ఇవ్వాలని వాదించాడు. ఆర్డర్‌లో పేరు వేరుగా ఉందని చెప్పి డెలివరీ బాయ్ ఇవ్వడానికి నిరాకరించాడు. ఈ క్రమంలో సతీష్‌కుమార్‌పై ఉదయ్ దాడి చేశాడు. దీంతో బాధితుడు డయల్ 100కు ఫోన్ చేయడంతో మల్కాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై మల్కాపురం సీఐ లూథర్‌బాబు విచారణ చేస్తున్నారు.